# పెన్ పవర్


10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

బుధవారం | 5 ఫిబ్రవరి 2025 | పేజీలు 8




సిద్ధి వినాయక నగర్‌లో ఐదంతస్తుల అక్రమ నిర్మాణంలో హాస్టల్ నిర్వహణ.. స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చింది ఇదే..



GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
Office of the Dy. Commissioner,
Circle No.26, Kukatpally Zone,
Gajularamaram, Hyd.

Speaking Order issued under TS-bPASS Act 2020 & GHMC Act 1955

No.5066/UC/TPS/C-26/KPZ/GHMC/2024 Dt.27.04.2024

**Sub:** GHMC – T.P.Section – Circle No.26 – Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor and not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram – Speaking order issued under TS-bPASS Act 2020/ GHMC Act 1955– Regarding.

**Ref:** 1.This office permit No.NIL
2.This Office registered under UCIMS vide UC No.5066.
3.This office Show cause Notice No.5066/UC/TPS/C26/KPZ/GHMC/2024 dt: 18.04.2024.
4.Your Reply: Nil.

******

Whereas, it is to inform that you have made the following Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor and not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram, which is contrary to the provisions of TS-Bpass& GHMC Act and Bye- Laws made there under as given below.

Details of the deviations / unauthorized constructions:

**1. You have not obtained the building permission from GHMC.**


**2. You have Unauthorizedly constructed the Ground floor + 3 upper floors + raised the columns for the 4th floor without taking prior permission from GHMC and also not maintaining the mandatory setbacks beside Sri Mallikarjuna Washing Center situated at Siddi Vinayaka Nagar, Suraram, Gajularamaram.**

**3. This office is directing you to stop the unauthorized construction work and also directing you to not to proceed with any further construction activities.**

Photograph of the unauthorized construction:

## గాజులరామారం సర్కిల్-26లో...

# అక్రమ నిర్మాణాల దందా..?



### షోకాజ్ నోటీసులు-స్పీకింగ్ ఆర్డర్‌లు జారీచేసి అక్రమార్కులతో భేరాలు..?

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 4:**

జీహెచ్ఎంసి అధికారుల ముసుగులో అక్రమ కట్టడాల దందా పరంపర కొనసాగుతుంది.. టిజి-బిపాస్ చట్టాన్ని తమకు అనుకూలంగా మలుచుకుని దందాను సాగిస్తున్నారు.. న్యాక్ ఇంజినీర్‌లు మొదలుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు, సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ల వరకు అక్రమ నిర్మాణ దారులకు బహిరంగంగానే సహకరిస్తున్నారు.. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులకూ వాటాలు వెళ్తున్నట్లు సమాచారం.. గాజులరామారం జీహెచ్ఎంసి సర్కిల్-26లో ఈ దందా "మూడు పూవులు ఆరు కాయలు" అన్న చందంగా విరాజిల్లుతోంది..గాజులరామారం ఉషోదయ కాలనీ పార్కు స్థలంలో 2021 సెప్టెంబర్ 2న "జీహెచ్ఎంసి టాస్క్ ఫోర్స్" డిమాలిషన్ చేసిన పార్కు కబ్జాను.. డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి అండతో పూర్తి చేసిన కబ్జాదారులు.. విషయాన్ని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు తీసుకోకుండా వదిలేసిన వైనం.. సూరారం సిద్ధి వినాయక నగర్‌లో 2024 ఏప్రిల్ 27న "స్పీకింగ్" ఆర్డర్ జారీచేసి అక్రమార్కునితో భేరం.. జీరో సెట్‌బ్యాకులతో ఐదంతస్తులు పూర్తి చేసి "హాస్టల్ నిర్మాణకు" అద్దెకిచ్చిన నిర్మాణ దారుడు.. సిద్ధి వినాయక నగర్‌లోనే మరో నాలుగు, ప్రమాదకర అక్రమ నిర్మాణాలకి గాజులరామారం సర్కిల్-26 టౌన్‌ప్లానింగ్ అండ..



-2లో

- జీహెచ్ఎంసి సర్కిల్-26 సూరారం 129 డివిజన్ సిద్ధి వినాయక నగర్‌లో ప్రమాదకర కట్టడాలు..
- అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలు.. జీరో సెట్‌బ్యాకులు.. నిబంధనలకు తిలోదకాలు..
- సర్కిల్-26 అధికారుల బహిరంగ దందా..? ఉన్నతాధికారులకు వాటాలు..?
- షోకాజ్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చిన 5అంతస్తుల అక్రమ నిర్మాణంలో హాస్టల్ నిర్వహణ..
- డిప్యూటీ కమిషనర్' టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ముడుపులకే ప్రాధాన్యత..?
- అనుమతులు "జీ ప్లస్ 2".. నిర్మాణాలు "జీ ప్లస్ 5" విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు..
- ఉత్సవ విగ్రహంగా సర్కిల్-26 ఉప కమిషనర్..! ధనార్జనే ధ్యేయంగా టౌన్‌ప్లానింగ్ దందా..?

## 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం..

# ఇది మా ఏండ్ల నాటి కల



**హైదరాబాద్ పెన్ పవర్:** 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం దొరికిందన్నారు మంత్రి దామోదర రాజనర్సింహ. ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్ పై అసెంబ్లీలో తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్గీకరణ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక న్యాయం అంబేద్కర్ కల అని చెప్పారు. ఇది మా ఏండ్ల నాటి కల అని అన్నారు. దేశంలో ఎస్సీలను ఏనాడు మనుషులుగా చూడలేదన్నారు. ఓ దళితున్ని పార్టీ అధ్యక్షుడిగా

-3లో

## తీన్మార్ మల్లన్న ఇతర కులాలను

# దూషించడం సరికాదు

- తీన్మార్ మల్లన్నకు బీ ఫారం ఇచ్చి గెలిపించుకున్నామన్న మంత్రి
- జిల్లాకు మంత్రిగా ఉన్న నేను... పార్టీ అభ్యర్థి ఓడిపోవాలని కోరుకుంటానా? అని ప్రశ్న
- వ్యక్తిగతంగా విమర్శిస్తే పట్టించుకోనని, ఒక కులాన్ని దూషించడం సరికాదన్న మంత్రి

-3లో



# గాజులరామారం సర్కిల్-26లో.. అక్రమ నిర్మాణాల దందా..?






## అనుమతులు 2 అంతస్తులు..! నిర్మాణాలు 5 అంతస్తులు..!

గాజులరామారం సర్కిల్-26 పరిధి సూరారం సిద్ధి వినాయక నగర్‌లో ఒకేసారి ప్రారంభించిన నాలుగు అక్రమ కట్టడాలు అధికారుల వసూళ్ళ దందాకి నిదర్శనం.. అనుమతులు జారీచేసిన అధికారులు సెట్‌బ్యాకులు, అదనపు అంతస్తులకు ముందుగానే భేరం కుదుర్చుకుని లక్షల్లో లంచాలు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.. సంబంధిత అక్రమ కట్టడాలు తేటతెల్లం చేస్తున్నాయి.. సిద్ధివినాయక నగర్‌లో, అదనపు అంస్తులు, నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు మొత్తం "హాస్టల్ నిర్వహణకై శరవేగంగా నిర్మిస్తున్నారు.. ప్రమాదకర కట్టడాలతో పరిసర ప్రజలను, హాస్టల్‌లో నివసించే వారిని రిస్కులో పెడుతున్నారు.. గాజులరామారం సర్కిల్-26 టౌన్‌ప్లానింగ్ అధికారుల వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గాజులరామారం సర్కిల్-26 కార్యాలయంలో ఉన్నతమైన చదువులు ఎల్ఎల్‌బి చేసిన అధ్కారులు కూడా, తమ విధులను నిర్వర్తించకుండా వ్యవహరిస్తున్నారు.. స్థానిక ప్రజలను, హాస్టల్‌లో నివసించే వారికి ప్రమాదాలు తలపెట్టే విధంగా అక్రమ కట్టడాలను ప్రోత్సాహించడం బాధాకరం.. ఇలాంటి అధికారుల నిర్వాకంతో, మహానగరంలో అక్కడక్కడా జరిగే అగ్నిప్రమాదాలకు, తప్పించుకోలేక ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ అధికారుల్లో మార్పు రాకపోవడమే గాక, పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించు కోకుండా, వాసూళ్ళకు పాల్పడుతున్నారు.. జీహెచ్ఎంసి కమిషనర్ వెంటనే స్పందించి గాజులరామారం సర్కిల్-26 అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు..**

- మొదటి పేజి తరువాయి

కూకట్‌పల్లి జీహెచ్ఎంసి జోన్ పరిధిలోని గాజులరామారం సర్కిల్-26 పరిధిలో కుప్పలు తెప్పలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి.. మరోవైపు సంబంధిత సర్కిల్-26 అధికారులు చర్యలు పక్కనపెట్టి, అక్రమ కట్టడాలతో దందాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు సహకరించడం విశేషం..? ఎక్స్‌లో జీహెచ్ఎంసికి ఫిర్యాదు చేసినా..! టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ సహకరిస్తున్నారే కాని చర్యల ఊసేలేదు.. ఒక ఐఏఎస్ అధికారి జోనల్ కమిషనర్‌గా ఉన్నప్పటికీ, గాజులరామారం సర్కిల్-26 అధికారుల కరెప్షన్‌కి అడ్డు లేకుండా పోతుందని సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. సర్కిల్-26 పరిధిలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే..! పర్మిషన్‌లకి నిర్మాణాలకి అస్సలు సంబంధం ఉండదు.. అనుమతులు తీసుకున్నా అక్రమమే తీసుకోక పోయినా అక్రమమే.. అధికారులను కుబేరులుగా మారుస్తున్న టిజి-బిపాస్ మున్సిపల్ చట్టం.. నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్లు అంటే "టంగ్ క్లీనర్‌గా" భావిస్తున్న జీహెచ్ఎంసి అధికారులు..? అధికారుల ధన దాహంతో ప్రమాదకర అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న గాజులరామారం సర్కిల్-26 టౌన్‌ప్లానింగ్ అధికారులు..

## స్పీకింగ్ ఆర్డర్‌లు జారీచేసి వసూళ్ళ దందా..?

గాజులరామారం సర్కిల్-26 పరిధి సూరారం 129 డివిజన్ సిద్ధి వినాయక నగర్‌లో "5 అంతస్తుల" అక్రమ నిర్మాణానికి "స్పీకింగ్ ఆర్డర్" జారీచేసిన అధికారులు భేరం కుదుర్చుకుని, డబ్బులు దండుకుని, చర్యల విషయాన్నే మరిచారు.. 2024 ఏప్రిల్ 18న షోకాజ్ నోటీసు, 27న స్పీకింగ్ ఆర్డర్ జారీచేసిన సమయంలో "గ్రౌండ్ ప్లస్ 3" అంతస్తుల "ప్రమాదకర" అక్రమ నిర్మాణాన్ని..! 5 అంతస్తులు నిర్మించి "హాస్టల్ నిర్వహణకి" అద్దెకు ఇచ్చినా నేటికీ చర్యలు శూన్యం.. గాజులరామారం సర్కిల్-26 సూరారం 129 డివిజన్ సిద్ధివినాయక నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా..! "గ్రౌండ్+5" అంతస్తులు నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు బహిరంగంగానే సహకరిస్తున్నారు.. సెట్‌బ్యాకులు లేకుండా "గ్రౌండ్+3" అంతస్తులు నిర్మించి 4వ అంతస్తుకు పిల్లర్‌లు కూడా రైజ్ చేసిన సమయంలో జీహెచ్ఎంసి అధికారులు "షో"కాజ్" నోటీసు నెం.5066/UC/TPS/C26/KPZ/ GHMC/2024 dt: 18.04.2024. జారీచేశారు.. అక్రమార్కుల నుండి సమాధానం రాలేదు.. ఆతర్వాత స్పీకింగ్ ఆర్డర్‌ను 27-04-2024న TS-BPASS చట్టం 2020 అండ్ GHMC చట్టం 1955 కింద స్పీకింగ్ ఆర్డర్ జారీచేశారు.. నెం.5066/UC/TPS/C-26/KPZ/GHMC/2024.. అయితే స్పీకింగ్ ఆర్డర్ జారీచేసే నాటికి "గ్రౌండ్+3" అంతస్తులతో 4వ అంతస్తుకు పిల్లర్‌లు మాత్రమే ఉండగా..! టౌన్‌ప్లానింగ్ సౌజన్యంతో ప్రస్తుతం, మొత్తం "గ్రౌండ్+5" ఫ్లోర్‌లు పూర్తిచేసి "ఆడపిల్లల హాస్టల్ నిర్వహణకు" అద్దెకు ఇవ్వడం గమనార్హం.. ప్రమాదం సంభవిస్తే తప్పించుకునే అవకాశం లేని తప్పుడు నిర్మాణాలను అధికారులు ప్రోత్సహిస్తున్నారు.. అక్రమార్కులతో భేరం కుదుర్చుకుని హాస్టల్ పిల్లలను అధికారులే ప్రమాదంలో పెడుతున్నారు.. ఈ విషయంపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఐఏఎస్, జీహెచ్ఎంసి కమిషనర్ పట్టించుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..




# వెల్‌డన్ తెలంగాణ సీఎంవో: తెలంగాణ ప్రభుత్వంపై వ్యంగ్యంగా కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల క్రితం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ నుంచి తొలగించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యను ఉద్దేశించి "వెల్‌డన్ తెలంగాణ సీఎంవో, వాట్ ఎ ఫెంటాస్టిక్ పెర్ఫార్మెన్స్" అంటూ ఆయన వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఈరోజు తెలంగాణ ప్రజలకు అందుబాటులో లేకుండా అధికారులు మాయం చేశారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. అధికారికంగా అందుబాటులో ఉన్న సర్వే నివేదికను ఎందుకు తొలగించాల్సి వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఈ సర్వేపై చేస్తున్న అసత్యాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు.
మన్నె క్రిశాంక్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేస్తూ వ్యంగ్యంగా స్పందించారు. ఈ సందర్భంగా 'ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఐ'లో 73 పేజీల సమగ్ర కుటుంబ సర్వే నివేదిక అందుబాటులో లేదంటూ ఒక ఇమేజ్‌ను ఆయన జత చేశారు.



## మొబైల్ బానిసలుగా ఇండియన్స్..రాత్రిపగలూ లేకుండా సెల్‌ఫోన్లోనే..

హైదరాబాద్ పెన్ పవర్:ఇటీవల కాలంలో సెల్ ఫోన్ వినియోగం అనేది ఓ వ్యసనంలా మారింది. ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వినియోగిస్తున్నారు.. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్ ఫోన్ ఆపరేట్ చేస్తున్నారు. మెసేజ్ లు, వీడియా కాల్స్ చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఆన్ లైన్ లో సెర్చింగ్ చేస్తూ గంటల కొద్దీ సమయం గడుపుతున్నారు. అయితే ఇది చాలా ప్రమాదం అంటున్నాయి సర్వే రిపోర్టులు. ప్రపంచ దేశాలకంటే మన దేశంలోని ప్రజలు స్క్రీన్ పై ఎక్కువ సమయం గడుపుతున్నారట.
సెన్సార్ టవర్స్ రిపోర్ట్ ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా ఆన్ లైన్ స్క్రీన్ వినియోగంలో మన దేశం మొదటి స్థానంలో ఉంది.. రెండో దేశంలో ఇండోనేషియా ఉంది. మొబైల్ ఫోన్లు, ఇతర స్క్రీన్లపై ఎక్కువ సమయం గడుపుతున్నారు మన భారతీయులు. రిపోర్టుల ప్రకారం దాదాపు 1.12 ట్రిలియన్ల గంటల స్క్రీన్లపై గడిపారు. 771.5 బిలియన్ల గంటలతో మన తర్వాత ఇండోనేషియా ప్రజలు ఉన్నారు. ఇది దేశంలో సెల్ ఫోన్ వ్యసనం, మానసిక ఆరోగ్యంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఇక 2024లో మన దేశంలో స్క్రీన్ వినియోగం 13 శాతం పెరిగింది. అదే అమెరికాలో అయితే బాగా తగ్గింది.. అమెరికా ప్రజలు సెల్ ఫోన్, ల్యాప్ టాప్ ల వంటి ఇతర స్క్రీన్ వినియోగం బాగా తగ్గించారు. 2024లో 0.6 శాతం అమెరికన్ల స్క్రీన్ వినియోగం తగ్గింది.
మనోళ్లు ఎక్కువగా సోషల్ మీడియా సర్ఫింగ్ లో గడుపుతున్నారని రిపోర్టులు చెబుతున్నాయి. దాదాపు 743.10 బిలియన్ల గంటలు సోషల్ మీడియాలో గడిపారని చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లల్లో పెరుగుతున్న స్క్రీన్ వినియోగంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. 1నుంచి 2 యేళ్ల లోపు పిల్లలు బాగా స్క్రీన్లకు గురవుతున్నారని తేలింది. చిన్న పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వడం అనేది పెద్ద చేతిలో ఉంటుంది.. చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు.
మరోవైపు పెద్దలు కూడా ఆకర్షణీయమైన యాప్ ల డిజైన్లు ఇతర ఆకర్షణలతో కష్టమర్లు బానిసలవుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని యాప్‌లపై అంతర్నిర్మిత నియంత్రణలు ఉన్నప్పటికీ భారతదేశంలో 60 శాతం మంది ఇప్పటికీ డిజిటల్ నిరక్షరాస్యులే అని నిపుణులు అంటున్నారు.



## రాజ్ తరుణ్-లావణ్య కేసులో అరెస్టైన మస్తాన్ సాయి వ్యవహారంలో కొత్త కోణం

హైదరాబాద్ పెన్ పవర్:రాజ్ తరుణ్ – లావణ్య కేసులో అరెస్టయిన మస్తాన్ సాయి వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. మస్తాన్ సాయి సుమారు 100 మందికి పైగా మహిళలను మోసం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు అభ్యంతరకర వీడియోలతో మహిళలను బ్లాక్‌మెయిల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మహిళలను బ్లాక్‌మెయిల్ చేసి పలుమార్లు అత్యాచా రం చేసినట్లుగా నిర్ధారించారు. యువతులను అసభ్యంగా దూషిస్తూ మానసిక క్షోభకు గురి చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించిన వారిని కూడా బెదిరించినట్లు గుర్తించారు. మస్తాన్ సాయిని మరోసారి కస్టడీకి తీసుకొని విచారించాలని పోలీసులు భావిస్తున్నారు. మస్తాన్ సాయి బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## సర్వేలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు వివరాలు ఇవ్వలేదు!: అసెంబ్లీలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:కుల గణన సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు కుల గణన సర్వేలో పాల్గొనలేదని ఆయన విమర్శించారు.అసెంబ్లీలో సామాజిక, ఆర్థిక, కుల గణనపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వేలో పాల్గొనని వారికి ఈ సభలో మాట్లాడే అవకాశం ఇవ్వవద్దని సభాపతికి ఆయన విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా సర్వేలో పాల్గొనలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. సర్వే ఫారంలో భూముల వివరాలు అడిగే కాలమ్ ఉన్నప్పటికీ ఎవరూ సమాచారం ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. భూముల వివరాలు అడిగితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు భయపడి సర్వేలో పాల్గొనలేదని ముఖ్యమంత్రి ఆరోపించారు.

## తీన్మార్ మల్లన్న ఇతర కులాలను దూషించడం సరికాదు

- మొదటి పేజీ తరువాయి

తీన్మార్ మల్లన్న బీసీ సభను ఏర్పాటు చేసి ఇతర కులాలను దూషించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బీసీ సభలో తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీలోని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేను తప్పుబట్టారు. ఒక సామాజిక వర్గం బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా చేస్తోందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు.
గెలుపోటములను నిర్ణయించేది వ్యక్తులు కాదని, ప్రజలని గుర్తించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం పని చేశామన్నారు. భారీ ర్యాలీ నిర్వహించి, అన్ని వర్గాలను మెప్పించి అతనిని గెలిపించుకున్నామని మంత్రి తెలిపారు. తాను జిల్లాకు మంత్రిగా ఉండి పార్టీ నుండి పోటీకి దింపి, అతను ఓడిపోవాలని కోరుకుంటానా? అని ప్రశ్నించారు. బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ మంచి నిర్ణయం తీసుకుందన్నారు. కాంగ్రెస్ బీ ఫారంపై పోటీ చేసి గెలిచిన తీన్మార్ మల్లన్న ఇప్పుడు అదే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వ్యక్తిగతంగా తనను విమర్శిస్తే పట్టించుకోనని, కానీ ఒక కులాన్ని దూషిస్తే ఏమాత్రం సహించేది లేదని అన్నారు.కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు ఉన్న ఆస్తులు ఎన్నో చెప్పాలంటే ఓ పుస్తకమే రాయాలని ఎద్దేవా చేశారు. కుల గణన సర్వేలో కవిత మినహా కేసీఆర్ కుటుంబం పాల్గొనలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కేంద్రం అంగీకరిస్తే ఫర్వాలేదని, లేకుంటే తమ పార్టీ మాత్రం రిజర్వేషన్లను అమలు చేస్తుందని తెలిపారు.

## 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం..ఇది మా ఏండ్ల నాటి కల

- మొదటి పేజీ తరువాయి

చేసింది కాంగ్రెస్ పార్టీనే అని కొనియాడారు.
అంతకు ముందు ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్ ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్... వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. కమిషన్ కు ప్రజలు 4750 అర్జీలు ఇచ్చారని చెప్పారు. 59 కులాల ఆర్థిక, రాజకీయ అంశాలపై కమిషన్ ఆరాతీసిందన్నారు. 82 రోజుల్లోనే కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందని చెప్పారు. ఎస్సీలను 3 గ్రూపులుగా విభజించాలని కమిషన్ సిఫారసు చేసిందని తెలిపారు సీఎం రేవంత్.

# రతన్ టాటా స్నేహితుడు శంతను నాయుడుకు టాటా మోటార్స్‌లో కీలక పదవి

**హైదరాబాద్ పెన్ పవర్:**దివంగత రతన్ టాటా యువ స్నేహితుడు శంతను నాయుడుకు టాటా మోటార్స్‌లో కీలక పదవి లభించింది. రతన్ టాటా చివరి దశలో కేర్ టేకర్‌గా శంతను నాయుడు వ్యవహరించారు. టాటా మోటార్స్‌లో స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్‌కు జనరల్ మేనేజర్‌గా శంతను నియమితులయ్యారు.

ఇందుకు సంబంధించిన విషయాన్ని తెలియజేస్తూ శంతను లింక్డిన్‌లో పోస్ట్ చేస్తూ, ఆనందం వ్యక్తం చేశారు. టాటా మోటార్స్ ప్లాంట్ నుండి తెలుపు రంగు చొక్కా, నేవీ బ్లూ ప్యాంట్‌లో తన తండ్రి నడుచుకుంటూ ఇంటికి వచ్చేవారని, ఆ సమయంలో తాను ఆయన కోసం ఎదురుచూస్తూ కిటికీలో నుండి చూసేవాడినని శంతను పేర్కొన్నారు. ఇప్పుడు నేను కూడా అలా నడిచొచ్చే రోజులు వచ్చాయని రాసుకొచ్చారు.టాటా ట్రస్ట్‌లో పిన్న వయస్కుడైన శంతను 2018 నుండి రతన్ టాటాకు అసిస్టెంట్‌గా వ్యవహరించాడు. వీరిద్దరికి మంచి అనుబంధం ఏర్పడింది.

# జగిత్యాల రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై దుర్మరణం!

## రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై కొక్కుల శ్వేత మృతి

## ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి ఓ చెట్టును ఢీకొట్టిన ఎస్సై కారు

## గొల్లపల్లి నుంచి జగిత్యాల వైపు వెళుతున్న సమయంలో ప్రమాదం

## ప్రస్తుతం జగిత్యాల పోలీసు హెడ్ క్వార్టర్స్ లో పనిచేస్తున్న శ్వేత



**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాలలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. చిల్వకోడూరు వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు ఓ చెట్టును ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న మహిళా ఎస్సై కొక్కుల శ్వేత చనిపోయారు. గొల్లపల్లి నుంచి జగిత్యాల వైపు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై వెళుతున్న వ్యక్తి కూడా మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. దాంతో ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా, శ్వేత ప్రస్తుతం జగిత్యాల పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు.

# బతికి ఉండగానే ఊరంతా పెద్దకర్మ భోజనాలు

# తల్లి వింత కోరిక తీర్చిన కుమారులు






**హైదరాబాద్ పెన్ పవర్:**అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం.. ఆత్మతృప్తికై మనుషులు ఆడే నాటకం.. వింత నాటకం.. ఎవరు తల్లి.. ఎవరు కొడుకు.. ఎందుకు ఆ తెగని ముడి.. కొనఊపిరిలో ఎందుకు అనగారణి అలజడి.. కరిగే కొవ్వొత్తిపై కనికరం ఎవరికి.. అవి కాలుతున్న వెలుగులే కావాలి అందరికీ.. 1972లో వచ్చిన తాత మనవడు సినిమాలోనిది ఈ పాట.. ఈ పాటకు అద్దం పడుతూ.. ఓ పెద్దావిడ తన కోరికను తీర్చుకోవాలనుకున్నది.. బతికి ఉండగానే పెద్దకర్మ భోజనాలు పెట్టాలని.. ఊరంతా పిలిచి వేడుకగా చేసుకోవాలని తపించింది. తన కోరికను కొడుకుల ముందు ఉంచి.. బతికి ఉండగానే పెద్దకర్మ భోజనాలు పెట్టించింది. ఈ వింత ఘటన.. ఆ తల్లి వింత కోరిక ఆంధ్రరాష్ట్రంలో జరిగింది. కృష్ణా జిల్లా పెడన మండలం ముచ్చర్ల గ్రామంలో రంగమ్మ అనే 80 ఏళ్ల వృద్ధురాలు ఉంది. త్వరలోనే చావు ఖాయం అని డిసైడ్ అయిన ఆ రంగమ్మ.. ఇప్పటికే తన ఆస్తులు అన్నింటినీ కొడుకులకు రాసిచ్చేసింది. చేతిలో ఏమీ లేదు.. ఇలాంటి సమయంలో నేను చనిపోతే నా కొడుకులు ఏం చేస్తారు.. కనీసం నా పెద్ద కర్మ అయినా చేస్తారా.. భోజనాలు పెడతారా లేదా అనే డౌట్ వచ్చింది. నేటి సమాజంలోని సంఘటనలు చూస్తున్న రంగమ్మకు ఓ ఆలోచన వచ్చింది. కొడుకులను పిలిచి.. నా పెద్ద కర్మ భోజనాలు నేను బతికి ఉండగానే పెట్టాలని.. అందు కోసం ఊరు అందరినీ పిలవాలని సూచించింది. కొడుకులు, బంధువులు షాక్ అయ్యారు. ఆ తల్లి రంగమ్మ పట్టుబట్టి అనుకున్నది సాధించింది. ఊరు మొత్తానికి కబురు పెట్టారు రంగమ్మ కొడుకులు, బంధువులు, చుట్టాలకు సమాచారం ఇచ్చారు. తల్లి రంగమ్మ పెద్ద కర్మ భోజనాలు బతికి ఉండగానే ఏర్పాటు చేయటం జరిగింది.. ఇది మా తల్లి కోరిక అని చాటింపు వేశారు. పెద్ద కర్మ రోజు ఎలాంటి భోజనాలు పెడతారో.. అచ్చం అలాంటి భోజనాలు తయారు చేయించింది.. ఆ తల్లి కళ్లెదుటే అందరికీ వడ్డించి పెట్టారు. ఈ కార్యక్రమం మొత్తం కళ్లారా చూసిన తల్లి రంగమ్మ హ్యాపీగా ఫీలయ్యింది. ఊరంతా ఇదేమి చోద్యం అంటూ నోరెళ్లబెట్టింది.. మరికొందరు ఇదేమి తిక్క అంటూ గుసగుసలాడుకున్నారు.

తల్లి శవం ఇంట్లో ఉండగానే ఖర్చులకు వాటాలు వేసుకునే ఈ రోజుల్లో.. తల్లి తుది శ్వాస విడిచిన మరుక్షణంలోనే ఆస్తుల కోసం కొట్టుకుంటున్న కొడుకులు ఉన్న

ఈ రోజుల్లో.. తల్లి బతికి ఉండగానే.. ఆమె వింత కోరికను తీర్చిన కొడుకులకు హ్యాట్సాఫ్ అంటున్నారు జనం. బతికి ఉండగా ఇంత బాగా చేసిన కొడుకులు.. రేపు రంగమ్మ పోయిన తర్వాత కూడా ఇంతే బాగా చేస్తారా.. ఇలాగే ఘనంగా భోజనాలు పెడతారో లేదో చూడాలి అంటూ మరికొందరు అమ్మలక్కలు చర్చించుకోవటం విశేషం. ఏదిఏమైనా అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం అని పెద్దలు ఎప్పుడో చెప్పారు.. ఆనాటి రంగమ్మకు ఆ మాత్రం తెలియదా ఏంటీ... అందుకే ముందే పెద్ద కర్మ భోజనాలను తన కళ్లారా చూసింది..

# కులగణనకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సామాజిక,ఆర్థిక కులగణన సర్వేకు తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేసింది. రేవంత్ తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం తెలిపింది. కులగణనపై తీర్మానం సందర్భంగా అసెంబ్లీలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ధీటుగా కౌంటర్ ఇచ్చాయి. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. కులగణన లెక్కల్లో బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించారని కేటీఆర్ అన్నారు. 2014లో సమగ్ర సర్వే వివరాలు వెబ్ సైట్లో పెట్టామని చెప్పారు . వెబ్ సైట్లో ఉన్న రిపోర్ట్.. ఆరోజు చేసిన సమగ్ర కుటుంబ సర్వేనే అని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీల సంఖ్య 51 శాతం. ముస్లీం బీసీలు 10 శాతం కలిపితే ఆనాటి మొత్తం బీసీలు 61 శాతం. 5 శాతం బీసీలను తగ్గించారు. మీ ప్రభుత్వం మీద నమ్మకం లేదు. ప్రత్యేక మైన బిల్లు తీసుకొస్తారని మేము ఆశించాం. కుటుంబ సర్వేచేసినప్పుడు రేవంత్ పాల్గొన్నారా?. 56 శాత ఉన్న బీసీలకు సబ్ ప్లాన్ తెస్తారని ఆశించాం అని కేటీఆర్ అన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేను లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం చేశారని ఫైర్ అయ్యారు. ఆనాడు సర్వేను ఊరు పేరు తెలియన వాళ్లతో చేయించారు. సర్వే రిపోర్ట్ పై ఎందుకు ఆనాడు కేబినెట్ లో చర్చించలేదు..

అసెంబ్లీలో పెట్టలేదు. అర్థం పర్థం లేని మాటలతో ప్రయోజనం లేదు. కులగణన సర్వేలో పాల్గొనలేని కేటీఆర్ కు మాట్లాడే హక్కు లేదు. వాళ్లకు మైక్ ఇవ్వొద్దు..సభలో మాట్లాడే అర్హత లేదు. వీళ్లు చూపిస్తున్న రిపోర్ట్ ప్రభుత్వ వెబ్ సైట్ లో లేదు. ఆనాడు సర్వే చేసిన ఎనామ్యులేటర్లు ఎవరు?. ఒక్కరోజులోనే రాష్ట్ర మొత్తాన్ని లెక్కించారా?. సమగ్ర సర్వేను వాళ్ల రాజకీయం కోసం వాడుకుంటున్నారు. లేని పోని విమర్శలతో ఉపయోగం లేదని కౌంటర్ ఇచ్చారు రేవంత్.

# నిజామాబాద్ లో అంతుచిక్కని వ్యాధి : లక్షల సంఖ్యలో కోళ్లు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కలకలం.. లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయి. పిట్టల్లా రాలిపోతున్నాయి. అప్పటికప్పుడు.. కళ్ల ముందే నిమిషాల్లో కోళ్లు చనిపోవటం కోళ్లఫారాల యజమానులను భయాందోళనలకు గురి చేస్తుంది. ఒక్క భీంగల్ మండలంలో లక్ష కోళ్లు చనిపోయాయని చెబుతున్నారు యజమానులు. ఏదైనా అంతుచిక్కని వైరస్ వచ్చిందా లేక బర్డ్ ఫ్లూనా అనే క్లారిటీ లేక ఆందోళన చెందుతున్న కోళ్ల ఫారం నిర్వాహకులు. ఇక వేల్పూర్ మండలం లాక్కోరా, శాయంపేటలోనూ ఇదే పరిస్థితి. కోళ్ల ఫారాల్లోని కోళ్లు వేల సంఖ్యలో చనిపోయాయి. అదే విధంగా బాల్కొండ నియోజక వర్గంలోనూ ఇదే పరిస్థితి. ఫారాల్లో కోళ్లు చనిపోతుండటం తో.. బతికి ఉన్న కోళ్లను అమ్మేసుకుంటున్నారు రైతులు. వైరస్ వచ్చి చనిపోతాయేమో అనే భయంతో.. వచ్చిన ధరకు అమ్మేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే నిజామాబాద్ జిల్లా పశు వైద్యాధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించారు. చనిపో యిన, బతికి ఉన్న కోళ్ల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ల్యాబ్ కు పంపించారు. కోళ్లు చనిపోవటానికి బర్డ్ ఫ్లూనా లేక మరో ఏదైనా వైరస్ కారణమా అనేది తేలాల్సి ఉంది. కోళ్లు చనిపోతున్న విషయం జిల్లా అంతటా వ్యాపించ టంతో.. ఫారం యజమానులు భయాందో ళనలకు గురవుతున్నారు. ఉన్న ఫారాలను ఖాళీ చేస్తున్నారు.

## ట్రేడ్ వార్: ట్రంప్ కు అదిరిపోయే కౌంటర్ ఇచ్చిన చైనా



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చీ రావడంతోనే వివిధ దేశాలపై వాణిజ్య టారిఫ్ ల సవరణకు పూనుకున్నారు. పలు దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై భారీగా సుంకాలు విధిస్తూ కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ ముఖ్యంగా చైనాపైనా ఫోకస్ చేశారు. చైనా నుంచి అమెరికాకు వచ్చే అన్ని రకాల ఉత్పత్తులపై 10 శాతం సుంకం విధించారు. తద్వారా డ్రాగన్ కంట్రీతో వాణిజ్య యుద్ధానికి మరోసారి తెరలేపారు. దీనిపై చైనా కూడా దీటుగా స్పందించింది. అమెరికా నుంచి తమ దేశానికి వచ్చే బొగ్గు, ద్రవరూప సహజ వాయువులపై 15 శాతం సుంకం విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. అంతేకాకుండా, అమెరికా టెక్ దిగ్గజం గూగుల్ పైనా చైనా విచారణకు ఆదేశించింది.

దీనిపై చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందించింది. టారిఫ్ లు పెంచుతూ అమెరికా తీసుకుంటున్న ఏక పక్ష నిర్ణయాలు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఇలాంటి నిర్ణయాలు అమెరికా సమస్యలను పరిష్కరించలేవని... ఇటువంటి వైఖరి చైనా-అమెరికా మధ్య సాధారణ ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని బలహీనపరుస్తుందని వివరించింది.

## తెలంగాణలో 10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్ మెనూ ఇదే!

- ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్స్
- సాయంత్రం పూట స్నాక్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయం
- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు స్నాక్స్



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో 10వ తరగతికి సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి తాజాగా మెనూ రూపొందించారు తృణధాన్యాలతో చేసిన బిస్కెట్లు (మిల్లెట్ బిస్కెట్లు), పల్లీ చిక్కీ, ఉడకబెట్టిన బొబ్బర్లు (పెద్ద శనగలు), ఉల్లిపాయ పకోడీలు, ఉడకబెట్టిన పెసర్లు, శనగలు-ఉల్లిపాయ వంటి వంటకాలను రోజుకొకటి చొప్పున విద్యార్థులకు అందించాలని అధికారులు నిర్ణయించారు. ఈ స్నాక్స్ కోసం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున ఖర్చు చేయనున్నారు. అందుకోసం, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఖాతాలకు నిధులు బదిలీ చేయను న్నారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు తెలంగాణలో టెన్త్ క్లాస్ పరీక్షలు జరగనుండగా... ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్స్ లో స్నాక్స్ అందించనున్నారు.

## ఆర్జే శేఖర్ బాషాపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో లావణ్య ఫిర్యాదు

**డ్రగ్స్ కేసులో ఇరికించేందుకు మస్తాన్‌సాయి, శేఖర్ బాషా ప్రయత్నిస్తున్నారని ఆరోపణ**

**తన ఇంట్లో 140 గ్రాముల డ్రగ్స్ పెట్టి ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదు**

**ఆడియో ఆధారాలను సమర్పించిన లావణ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** డ్రగ్స్ కేసులో నిందితురాలిగా ఉన్న నటి లావణ్య, ప్రముఖ ఆర్జే, బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషాపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డ్రగ్స్ కేసులో తనను ఇరికించేందుకు మస్తాన్‌సాయి, శేఖర్ బాషా ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆడియో ఆధారాలను ఆమె పోలీసులకు సమర్పించారు. తన ఇంట్లో 140 గ్రాముల డ్రగ్స్ పెట్టి ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.మస్తాన్‌సాయి మహిళలకు డ్రగ్స్ ఇచ్చి, లైంగిక వాంఛలు తీర్చుకుంటూ వీడియోలు చిత్రీకరిస్తుంటాడని ఇదివరకే లావణ్య ఫిర్యాదు చేయగా, నార్సింగి పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అతడి బాధితుల్లో వివాహిత మహిళలు కూడా ఉన్నారని వెల్లడించింది. సినీ నటుడు రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని లావణ్య ఇదివరకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ వివాదంలోనే మస్తాన్‌సాయి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇదిలా ఉండగా, లావణ్య డ్రగ్స్ కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు.

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇవ్వడంపై రేవంత్ రెడ్డి స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రొసీజర్ లో భాగంగానే నోటీసులు జారీ అయ్యాయని చెప్పారు.కులగణన చేసింది రాజకీయ ప్రయోజనాల కోసం కాదని అన్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తామే అలాంటి ప్రక్రియ చేపట్టామని చెప్పారు. కులగణన వల్ల 76 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కులగణన చేసి చరిత్ర సృష్టించామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కు బాధ్యత లేదని... ఆ పార్టీని తాము పట్టించుకోబోమని అన్నారు. కోర్టు ఆదేశాలతో బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేశామని... కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

## సబ్జెక్టు, నోట్స్ సిద్ధం చేయలేదని శాసన సభను వాయిదా వేయడం హాస్యాస్పదం

**హైదరాబాద్ పెన్ పవర్:** సబ్జెక్టు, నోట్స్ సిద్ధం చేయలేదని శాసన సభను వాయిదా వేయడం హాస్యాస్పదమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో స్పందిస్తూ.. అసెంబ్లీని వాయిదా వేయడంపై కీలక వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ప్రారంభమైన రెండు నిమిషాలకే వాయిదా వేయటం ఏంటి? అని ప్రశ్నించారు. కేబినెట్ సమావేశం ఇంకా కొనసాగుతోందని.. సబ్జెక్టు, నోట్స్ సిద్ధం చేయలేదని సభను వాయిదా వేయడం హాస్యాస్పదని.. నాడు ప్రతిపక్షంలో ఉన్నా కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా లేరని.. నేడు పాలక పక్షంలో ఉన్నా సిద్ధంగా లేరని హరీశ్‌రావు సెటైర్ వేశారు.కాగా, మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అసెంబ్లీ ప్రత్యేక సమావేశం? సభ వ్యవహారాల శాఖ మంత్రి కోరిక మేరకు స్పీకర్ గడ్డ ప్రసాద్ కుమార్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు.

## వ్యవసాయ రంగాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్...

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాము. మంగళవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలో చెల్పూరి రాము. మాట్లాడుతూ. శనివారం రోజున కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన 50,65,345 మొత్తం కేంద్ర బడ్జెట్, రైతంగాన్నీ పేద ప్రజలను వంచన చేసి బడా కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధంగా ఉందని పేద ప్రజలకు ఆసరాగాలేని బడ్జెట్ ప్రవేశపెట్టారని అన్నారు, 2025-2026 బడ్జెట్ తమ రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప దేశ సమ్మిళిత అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్టు లేదని అన్నారు, రైతాంగం ఆదాయాన్ని రెట్టింపు చేసే హామీలో భాగంగా నిధుల కేటాయింపులు లేవని కిసాన్ సమాన్ నిధి ఊసే లేదని, ఎరువులు విత్తనాల సబ్సిడీ గాలికి వదిలేసిందని పంటల బీమా పథకానికి కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ఆధారంగా కనీస గిట్టుబాటు ధరల చట్టం ఈ పార్లమెంటులో చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. నూతన జాతీయ మార్కెటింగ్ విధానం రద్దు చేయాలని విద్యుత్తు సవరణ చట్టం ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వం పదే పదే వల్లేవేస్తున్న వికసిత్ భారత్ ఇలాంటి వైఖరితో సాధ్యమవుతుందా అని పునర్ సమీక్షించుకోవాలని అన్నారు. ఎన్నికలు ఉన్నా రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష సరికాదన్నారు. దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనసులోయి అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్,దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్టు బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరం అన్నారు. 10 సంవత్సరాల నుండి ఇదే ధోరణినీ ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటున్నది కేంద్ర ప్రభుత్వం అని అన్నారు. 2024 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్,2025 ఢిల్లీ బీహార్ రాష్ట్రాల కోసం బడ్జెట్ పెట్టారని,2026 యూపీ బడ్జెట్,2027 గుజరాత్ కోసం బడ్జెట్ పెడుతారా యావత్ దేశానికి సరిపోయే బడ్జెట్ ఎప్పుడు పెడతారని ప్రశ్నిస్తున్నామని అన్నారు. బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి చోటు లేదా తెలంగాణ ప్రాంతం ప్రయోజనాలకు విలువ లేదా అని అన్నారు. ఇది కేంద్ర బడ్జెట్ లా లేదని కేవలం మూడు నాలుగు రాష్ట్రాల బడ్జెట్ ఇలా ఉందన్నారు తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ రాష్ట్రానికి ఏమి సాధించినట్టు అని విమర్శిస్తున్నామని అన్నారు. తెలంగాణతో తమకు బంధం లేదని బడ్జెట్ ద్వారా మరోసారి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరూపించింది అని అన్నారు. కేంద్ర జిడిపికి 5.1 శాతం కాంట్రిబ్యూట్ చేస్తున్న తెలంగాణ మరోసారి మోసపోయిందని అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ట్రైబల్ యూనివర్సిటీకి ఇవ్వాల్సిన నిధులు కూడా ఇవ్వకపోవడం తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజెపి చేసింది ఏమీ లేదు అని కేంద్ర బడ్జెట్ ద్వారా నిధులు రాబట్టుకోవడంలో బిజెపి ఎంపీలు విఫలమయ్యారని అన్నారు. కేంద్రానికి మద్దతు పలికిన జనతాదళ్ (యు) బీహార్ లో వివిధ అభివృద్ధి పనులకు రూ.26 వేల కోట్ల సాయం, 2,400 మెగావాట్ల పవర్ ప్లాంట్, గాయాలు పారిశ్రామిక కారిడార్, నూతన విమానాశ్రయాలు, మెడికల్ కాలేజీలకు సాయం తదితరాలు పొందిందని అన్నారు.

# ఇంటి భోజనం తప్ప బయట తిండి తినడు... ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్ లైఫ్ స్టైల్

- ఇటీవల పోలీసులకు పట్టుబడిన ఘరానా దొంగ ప్రభాకర్
- అతడి జీవనశైలి గురించి తెలుసుకుని ఆశ్చర్యపోయిన పోలీసులు!
- వంట మనిషికి నెలకు రూ.10 వేలు
- ఆడి, బీఎండబ్ల్యూ కార్ల కొనుగోలు
- ఇంట్లోనే జిమ్... రెండు పూటలా ఎక్సర్ సైజులు



**హైదరాబాద్ పెన్ పవర్:**దాదాపు 80 వరకు కేసులున్న ఘరానా దొంగ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్ రెడ్డిని పోలీసులు ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రిజమ్ పబ్ లో అరెస్ట్ చేయడం తెలిసిందే. ప్రభాకర్ పలు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గా ఉన్నాడు. అతడి లైఫ్ స్టైల్ చూస్తే... వీడు దొంగా, లేక సెలబ్రిటీనా అనిపిస్తుంది. ఇంట్లో వండిన భోజనం తప్ప బయట తిండి తినడు. ప్రత్యేకంగా వంట మనిషికి నెలకు రూ.10 వేలు చెల్లిస్తుంటాడు. ఫిట్ నెస్ కోసం ఇంట్లోనే జిమ్ ఏర్పాటు చేసుకున్న ప్రభాకర్, తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం ఎక్సర్ సైజులు చేస్తాడు. ఎప్పుడైనా పబ్, రెస్టారెంట్ కు వెళితే వేలల్లో టిప్పులు ఇస్తుంటాడు. ఆడి, బీఎండబ్ల్యూ వంటి లగ్జరీ కార్లలో తప్ప మామూలు కార్లలో తిరగడు. ఇతర పేర్లతో ఐదు విలాసవంతమైన కార్లు కొనుగోలు చేశాడు. అతడి వైవాహిక జీవితం చూస్తే... పెళ్లయింది కానీ భార్యతో ఉండడు. మరో రాష్ట్రానికి చెందిన అమ్మాయితో కలిసి గచ్చిబౌలిలోని ఫ్లాట్ లో ఉంటున్నాడు. ఇక వేశ్యల వద్దకు వెళ్లినప్పుడు వారికి అధిక డబ్బు ఆశ చూపి వారి పేరు మీద సిమ్ కార్డులు కొనుగోలు తీసుకునేవాడట.తనకు ఏపీలో చేపల చెరువులు ఉన్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటానని స్నేహితులకు చెబుతుంటాడు. రక్షణ కోసం అని చెప్పి బీహార్ నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేసి 3 తుపాకులు తెప్పించుకున్న ప్రభాకర్... ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో తుపాకీ కాల్చడం ప్రాక్టీస్ చేశాడు. గురి తప్పకుండా కాల్చడం నేర్చుకునే క్రమంలో ఓ కుక్కను కూడా కాల్చి చంపాడు.

ఇక, పోలీసులు అతడి ఫ్లాట్ నుంచి ఒక డైరీని స్వాధీనం చేసుకున్నారు. ఆ డైరీలో తన లక్ష్యాలను రాసుకున్నట్టు గుర్తించారు. ఫేమస్ టూరిస్ట్ ప్లేస్ గోవాలో ఓ హోటల్ కట్టాలన్నది అతడి కోరిక. వివిధ ప్రాంతాల్లో ఊరి బయట ఉండే ఇంజినీరింగ్ కాలేజీల్లో చోరీలు చేయడం అతడి స్పెషాలిటీ. ప్రభాకర్ లైఫ్ స్టైల్ ఇలా ఉంటే... స్వగ్రామంలో అతడి తండ్రి భిక్షాటన చేసి బతుకుతున్నాడు. రేషన్ బియ్యం, పెన్షన్, భిక్షాటనతో వచ్చే సొమ్మే ఆయనకు జీవనాధారం.

# : బ్రెజిల్‌లో 'నెల్లూరు' జాతి ఆవుకు రూ. 40 కోట్ల ధర.. గిన్నిస్ బుక్‌లో చోటు!



- బ్రెజిల్‌లోని మినాస్ గెరైస్‌లో వియాటినా-19 అనే ఆవు వేలం
- దీని బరువు 1,101 కిలోలు
- గతంలోనూ పలు అవార్డులు అందుకున్న గోవు
- వీటినే మన దగ్గర ఒంగోలు జాతి ఆవులుగా పిలుపు
- అధిక ఉష్ణోగ్రతలను కూడా తట్టుకోగలిగే శక్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**బ్రెజిల్‌లో జరిగిన వేలంలో నెల్లూరు జాతి ఆవు కనకవర్షం కురిపించింది. 4.8 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో చెప్పాలంటే దాదాపు రూ. 40 కోట్లకు అమ్ముడుపోయి ఏకంగా గిన్నిస్ రికార్డులకెక్కింది. బ్రెజిల్‌లోని మినాస్ గెరైస్‌లో నిర్వహించిన వేలంలో నెల్లూరు జాతికి చెందిన వియాటినా-19 అనే ఆవును వేలం వేయగా ఓ వ్యక్తి దానిని ఈ మొత్తానికి సొంతం చేసుకున్నాడు. దీని బరువు ఏకంగా 1,101 కిలోలు. ఇదే జాతికి చెందిన ఆవులతో పోలిస్తే ఇది రెట్టింపు బరువు.అత్యధిక ధర పలికిన వియాటినా-19 గోవుగా రికార్డులకెక్కిన ఈ ఆవు.. గతంలోనూ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. కండరాల నిర్మాణం, అత్యంత అరుదైన జన్యువులు కలిగి ఉన్నందుకు గాను ఇది 'చాంపియన్స్ ఆఫ్ ది వరల్డ్'లో 'మిస్ సౌత్ అమెరికా' అవార్డు అందుకుంది. ఈ ఆవు అండాలను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తున్నారు. ఇవే ఆవులను మనం ఒంగోలు జాతిగా పిలుస్తుంటాం. ఇవి అధిక ఉష్ణోగ్రతలను సైతం తట్టుకుని మనుగడ సాగించగలవు. 1800 సంవత్సరాల్లో ఈ జాతి ఆవులు బ్రెజిల్‌కు ఎగుమతి అయ్యాయి. వీటిలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది.

# ఇంటింటి కుల సర్వే

**హైదరాబాద్ పెన్ పవర్:** 1931 కి స్వాతంత్ర్యం కి ముందు కుల సర్వే జరిగింది స్వాతంత్ర్యం తరువాత మళ్ళీ కుల సర్వే జరగలేదు

బలహీన వర్గాలకు మేమెంతో మాకంత ఉండాలని సమాచారం కులాల లెక్కలు లేక దాని ప్రకారమే ప్రభుత్వ పథకాల వచ్చేవి.

భారత్ జోడో యాత్ర లో మా నాయకుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగినప్పుడు చాలా వర్గాలకు ప్రాతినిధ్యం లేదు వారికి అవకాశాలు రావాలంటే ఎవరేంతో వారికి తెలవల్సిందే అని ఎన్నికల్లో చెప్పడం జరిగింది

టిపీసీసీ పక్షాన మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు కామారెడ్డి డిక్లరేషన్ బీసీ డిక్లరేషన్ కి చైర్మన్ గా ఉన్నాను

బలహీన వర్గాలపై స్పష్టంగా మా విధానం చెప్పడం జరిగింది.. ఇచ్చిన మాటకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంగళవారం క్యాబినెట్ సమావేశం జరిగింది.16 న శాసన సభలో తీర్మానం చేసుకున్నాంపార్లమెంట్ ఎన్నికల తర్వాత చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ప్లానింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ సర్వే జరిగింది

లక్ష మంది ప్రభుత్వం ఉద్యోగులతో ఈ సర్వే చేసి సమాచారాన్ని సెకరించాం.

1931 నుండి సమాచారం లేదు

బలహీన వర్గాలకు సంబంధించి మీరు ఇంకా న్యాయం చేయాలనుకుంటే సలహాలు సూచనలు చెప్పండి.

బలహీన వర్గాల శాఖ మంత్రిగా వాటన్నిటిని బలహీన వర్గాల అభివృద్ధికి తీసుకుపోతాం

ప్రతిదీ రాజకీయం చేసినట్టు బలహీన వర్గాల ఆకాంక్షలను రాజకీయం చేయకండి

తెలంగాణ అన్ని జిల్లాలో స్వేచ్చగా తమ ఆకాంక్ష ముందుకు తీసుకుపోవాలి

ఈ సమాచారాన్ని తీసుకొని భవిషత్ లో ఆయా వర్గాలకు న్యాయం చేయడానికి ఉపయోగపడతుంది.

బలహీన వర్గాల అభివృద్ధికి ఈ రోజు నుండి శకం ప్రారంభమైంది

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న సమాచార సేకరణ దేశానికి రోల్ మోడల్

తెలంగాణ దేశానికి దిక్సూచి

రాహుల్ గాంధీ పార్లమెంటు లో తెలంగాణ



ప్రభుత్వం చేసిన సమగ్ర కుల సర్వే ప్రజా ప్రతినిధులకు గౌరవం అన్నారు.

నివేదిక వచ్చిన తరువాత ముందుకు పోవడానికి రోడ్ మ్యాప్ తీసుకుపోవడానికి సభలో చర్చించుకొని భవిషత్ లో అందరికి మార్గదర్శకత్వం దొరుకుతుంది.

తెలంగాణ వ్యాప్తంగా ఎదురు చూస్తున్న బలహీన వర్గాలకు ఒక అవకాశం దొరుకుతుంది

1986 లో మురలీధర్ రావు కమిషన్ వచ్చినప్పుడు విద్యార్థి నాయకుడిగా, మాజీమంత్రి గంగుల కమలాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కమిషన్ ఉద్యమంలో పాల్గొని నిలదీసినం,

బావి తరాలకు న్యాయం జరగడానికి బలహీన వర్గాలకు న్యాయం జరగడానికి మా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జీవితంలో నాకు గొప్ప కార్యక్రమం

మా నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి, కమిటీ చైర్మన్ గా మార్గదర్శకత్వం చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, సహచర మంత్రులు రాజకీయ పార్టీల నాయకులకు బలహీన వర్గాల శాఖ మంత్రిగా ధన్యవాదాలు తెలుపుతున్న.

ఇప్పటి వరకు లెక్కలే లేవు లెక్కలు తక్కువ ఎలా వస్తాయి ఇప్పుడు జరిగిన లెక్కలు కొలమానం భవిష్యత్ లో మరోసారి సర్వే జరిగినప్పుడు మార్పు కనిపిస్తుంది.

ప్రతి ఇంటికి వెళ్లి సహకరించిన సహకరించక పోయిన వారు ఇంటికి వెళ్లి స్వచ్ఛందంగా సమాచారాన్ని సేకరించాం.

నివేదిక సబ్ కమిటీకి సమర్పించారు

సబ్ కమిటీ లో చర్చించి కేబినెట్ లో పెట్టింది.

బలహీన వర్గాలకు న్యాయం జరగడానికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి తో పనిచేస్తుంది

2011 జనాభా లెక్కల్లో ఆనాడు తెలంగాణ లో 3 కోట్ల 50 లక్షలు ఉండేది.. ఇప్పుడు 3 కోట్ల 70 లక్షల మంది ఉన్నారు.

కేంద్రం నుండి జనాభా ప్రాతిపదికన దక్షిణ ,ఉత్తర భారతదేశానికి నిధులు జనాభా ప్రాతిపదికన ఇస్తున్నారు..

దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు పాటించడం జనాభా తగ్గింది.

160 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టీ లక్ష మంది ఉద్యుగులతో ఈ ప్రక్రియ చేపట్టింది.

సలహాలు సూచనలు ఇవ్వండి సున్నితమైన అంశం

చాలా కాలంగా ఎంతో మంది మేదావులు, సంఘాలు, ఉద్యమకారులు ఈ సర్వే కోసం ఉద్యమిస్తే రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా ఎవరెంతో వారంతా తెలవాల్సిందే అని ఈ సర్వే జరిగింది.

బలహీన వర్గాలకు న్యాయం జరగాలి రోడ్డు మ్యాప్ రావాలి వారికి అందే కార్యక్రమాలపై ఆలోచన చేయాలి

బలహీన వర్గాలకు న్యాయం జరుగుతున్నప్పుడు దానికి మించిన సంతోషం లేదు.

అందరూ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా బలహీన వర్గాల బిడ్డలు స్వాగతిస్తూ సలహాలు సూచనలు ఇవ్వండి

బలహీన వర్గాలకు న్యాయం జరగలేనే దానికన్నా మించిన సంతోషం ఇంకోటి ఉండదు.

బలహీన వర్గాల మార్పుకు శ్రీకారం చుడుతున్న రోజు10 సంవత్సరాలుగా కావాలనే ఉద్యమకారులు స్వాగతించాలి.

గొప్ప చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న బలహీన వర్గాల బిడ్డగా సబ్ కమిటీ సభ్యుడిగా డిక్లరేషన్ చైర్మన్ గా, బలహీన వర్గాల మంత్రిగా కుల సర్వే తీర్మానం ప్రవేశ పెట్టే అదృష్టం కలిగింది

మన వర్గాలకు అన్నిటికీ న్యాయం జరిగే కార్యక్రమం అందరూ సలహాలు సూచనలు ఇవ్వండి.

# మాది ముగ్గురు సభ్యుల వ్యవస్థ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేసిన ఆరోపణలను తిప్పికొట్టిన ఇసి **న్యూఢిల్లీ ఫిబ్రవరి 4:** ఎన్నికల కమిషన్ (ఇసి)ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ నడుపుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేసిన ఆరోపణలను ఇసి మంగళవారం తిప్పికొట్టింది. తమది ముగ్గురు సభ్యుల సంస్థ అని ఇసి సుస్పష్టం చేసింది. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌ను అపఖ్యాతి పాలుజేయడానికి ఆప్ ‘పదే పదే ఉద్దేశపూర్వకం గా పాల్పడుతున్న ఒత్తిడి ఎత్తుగడలను’ తాము ఉమ్మడిగా గమనించామని ఇసి తెలియజేసింది. ఇసి ఏక సభ్య సంస్థ అనే అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారని కమిషన్ విమర్శించింది.‘రాజ్యాంగబద్ధమైన సంయమనం పాటించాలని తాము నిర్ణయించుకున్నామని, అటువంటి విమర్శలను తెలివిగా దిగమింగుకు ంటున్నామని, అటువంటి నిందారోపణలకు ప్రభావితం కారాదని నిర్ణయించుకున్నామని ఇసి ‘ఎక్స్’లో ఒక పోస్ట్‌లో తెలిపింది. బిజెపి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనను ఇసి అలక్షం చేస్తోందని ఆప్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ సహా పార్టీ అగ్ర నాయకులు ఆరోపించారు.రిటైర్‌మెంట్ అనంతర బాధ్యత స్వీకారం ఉద్దేశంతో రాజీవ్ కుమార్ బిజెపిపై చర్య తీసుకోవడం లేదని కేజ్రీవాల్ ఆరోపించారు. రాజీవ్ కుమార్ 65వ ఏట ప్రవేశించిన మీదట ఈ నెల 18న పదవీ విరమణ చేయనున్నారు. జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఇతర ఎన్నికల కమిషనర్లు.‘ఇసిఐ ఏక సభ్య సంస్థ అన్నట్లుగా ఢిల్లీ ఎన్నికల్లో ఇసిఐని అపఖ్యాతి పాలుజేయడానికి పదే పదే పాల్పడుతున్న ఒత్తిడి ఎత్తుగడలను ముగ్గురు సభ్యుల కమిషన్ ఉమ్మడిగా గమనించింది, అటువంటి విమర్శలను తెలివిగా దిగమింగుకుంటూ రాజ్యాంగబద్ధమైన సంయమనం పాటించాలని, అటువంటి నిందారోపణలకు ప్రభావితం కారాదని నిర్ణయించుకున్నాం’ అని ఎన్నికల కమిషన్ తన ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలియజేసింది. కమిషన్ ఈ విధంగా స్పందించడం అరుదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి.

## నార్సింగి పోలీసులకు లావణ్య పిర్యాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** నార్సింగి పోలీస్ స్టేషన్ కి మరోసారి లావణ్య వచ్చింది. గతంలో డ్రగ్స్ కేసులో అనుమానితుడు మస్తాన్ సాయి, బిగ్ బాస్ ఫేం ఆర్జే శేఖర్ బాషా పై ఫిర్యాదు చేసింది.మస్తాన్ సాయి, శేఖర్ బాషా ఇద్దరు కలిసి తనను డ్రగ్స్ కేసులో ఇరికించే ప్రయత్నం చేసారని లావణ్య అంటోంది. ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మస్తాన్ సాయి, శేఖర్ బాషా మాట్లాడుకున్న ఆడియో లను పోలీసులకు అందించింది. తనతో పాటు మరో యువతి ని కూడా ఇరికించే ప్లాన్ చేశాని లావణ్య ఆరోపణ.

లావణ్య అడ్వకేట్, నాగూర్ బాబు మాట్లాడుతూ బిగ్ బాస్ ఫేం శేఖర్ బాషా పై ఫిర్యాదు చేసింది లావణ్య. లావణ్య తోపాటు మరో యువతి ని డ్రగ్స్ కేసులో ఇరికించాలని ప్లాన్ చేసారు.. లావణ్య ఇంట్లో ఒక పార్టీ పెట్టుకుందాం.. పార్టీకి ఆ యువతిని కూడా పిలుద్దాం. పార్టీలో డ్రగ్స్ పెట్టి అక్కడి నుంచి జారుకుందాం అని శేఖర్ బాషా, మస్తాన్ సాయి మాట్లాడుకున్న ఆడియో క్లిప్ లను కూడా పోలీసులకు ఇచ్చింది. ఇందుకోసం 130 గ్రాముల ఎందిఎంయే డ్రగ్స్ కూడా తీసుకున్నాను అని మస్తాన్ సాయి కి వీడియో కాల్ చేసి చెప్పాడు. వాటిని కూడా అందించామని అన్నారు.

## నారాయణ కాలేజీని తరలించండి

**హైదరాబాద్ పెన్ పవర్:** హయత్ నగర్ సామ నగర్ లో ఉన్న నారాయణ కళాశాల ముందు కాలనీవాసులు ఆందోళనకు దిగారు.. నారాయణ కళాశాల ఇంటర్మీడియట్ హాస్టల్ విద్యార్థులు.. కాలనీ మహిళలు రోడ్డు పై వెళ్తున్నపుడు,, ఇంట్లో బాల్కనీ లో ఉన్నపుడు,, పైకి పేపర్ రాకెట్లు విసిరేస్తు,లేజర్ లైట్లు కోడుతూ బూతు మాటలు తిడుతున్నారని, స్నానం చేసి వచ్చి కిటికీలో నుండి టవల్ విప్పి న్యూడ్ గా చూడమంటూ కేకలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ఉండాలంటే కూడా భయంగా ఉందంటూ కళాశాల ముందు ఆందోళనకు దిగారు. కాలనీ మహిళలు వారి కుటుంబ సభ్యులు, ఇంట్లో బాల్కనీలో ఉండి కూడా ఏదైనా పని చేసుకుంటే అసభ్యంగా కామెంట్స్ చేస్తున్నారని ఇక్కడ ఉన్న నారాయణ కళాశాల యజమాన్యానికి చెప్పిన పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళలు, నారాయణ కళాశాల యాజమాన్యం పిల్లలకు చదువు నేర్పించడం లేదు. ఇలా మహిళలతో బూతుగా ప్రవర్తించాలని నేర్పిస్తున్నారని మహిళలు అన్నారు.ఈ కళాశాల ఇక్కడ నుండి తీసివేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## వ్యక్తి దారుణ హత్య బషీరాబాద్ నవల్గా గేటు వద్ద ఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓ వ్యక్తి తలపై గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో మోది దారుణ హత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం నవల్గా గేటు సమీపంలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. నవల్గా గ్రామానికి చెందిన మాల శ్యామప్ప గ్రామ సమీపంలోని గేటు వద్ద హత్యకు గురయ్యారు. మంగళవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బషీరాబాధ్ ఎస్ఐ శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు శ్యామప్ప తలపై బండరాళ్లతో మోది హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘటనా స్థలంలో ఎస్ఐ శంకర్ వివరాలను సేకరించారు.

గ్రామస్తులతో మాట్లాడి హత్యకు గల కారణాలను ఆరా తీశారు. గ్రామానికి చెందిన శ్యామప్పను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయడంతో స్థానికంగా ఈ సంఘటన కలకలం రేపింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# 56% ఉన్న బీసీలకు తగిన గౌరవం ఇస్తాం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4, పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ సమావేశం కొనసాగుతోంది. కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చ మొదలైంది. సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలు ఉభయసభల ముందుకు తీసుకొచ్చింది ప్రభుత్వం. కుల–సర్వే 2024 నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో బలహీనవర్గాలకు సంబంధించి ఇప్పటి వరకు సహేతుకమైన సమాచారం లేదని, దీంతో రిజర్వేషన్లు అమలు చేసే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్న పరిస్థితి ఉందన్నారు. 1931 తరువాత భారతదేశంలో ఇప్పటి వరకు బలహీన వర్గాల సంఖ్య ఎంతో తేల్చలేదని అన్నారు. జనాభా లెక్కల్లోనూ బలహీనవర్గాల లెక్కలు పొందుపరచలేదని, అందుకే భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ రాష్ట్రంలో కులగణన చేస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. కులగణన ప్రక్రియను పూర్తి చేసి ఇవాళ నివేదికను సభలో ప్రవేశపెట్టామని అన్నారు. ప్రతీ గ్రామంలో, తండాల్లో ఎన్యూమరేటర్లు పకడ్బందీగా వివరాలు సేకరించారని, ప్రతీ 150 ఇండ్లను ఒక యూనిట్ గా గుర్తించి ఎన్యూమరేటర్లను కేటాయించి వివరాలు సేకరించామన్నారు.కులగణన కోసం రాష్ట్రంలో 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజులు కష్టపడి ఈ నివేదికను రూపొందించారని, రూ.160 కోట్లు ఖర్చుచేసి ఒక నిర్దిష్టమైన పకడ్బందీ నివేదిక రూపొందించామని పేర్కొన్నారు. పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తరువాత సభలో ప్రవేశపెట్టామన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు సముచిత గౌరవం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని, దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదికను రూపొందించడానికి కృషి చేసిన అందరికీ



అభినందనలు తెలియజేస్తున్నానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సర్వే నివేదికలో జనాభా లెక్కలలపై తేడాలు ఉన్నాయన్నారు.రాష్ట్రంలో బీసీల జనాభా కోటి 64 లక్షల 9 వేలు ఉన్నట్లు నివేదిక ద్వారా తెలుస్తోంది. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ జనాభా 51 శాతం ఉందన్నారు. శాస్త్రీయంగా చేసిన సర్వే ప్రకారం బీసీ జనాభా పెరిగినట్లు తేలిందని సీఎం రేవంత్ అన్నారు.అసెంబ్లీలో కులగణన సర్వే నివేదికను ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధిగా కులగణన సర్వే వివరాలను నివేదిక రూపంలో సభలో ప్రకటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఇదొక చారిత్రాత్మకమైన సందర్భమని సీఎం అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం కులగణన సర్వే చేపట్టామని, రాష్ట్రంలో 66 లక్షల 99 వేల 602 కుటుంబాల సమాచారాన్ని సర్వే ద్వారా సేకరించామన్నారు.మొత్తం తెలంగాణలో 96.9 శాతం సర్వే పూర్తి చేశామని, డేటా ఎంట్రీ పూర్తి చేయడానికి 36 రోజులు పట్టిందన్నారు. తమ ఏడాది పాలనలో సర్వేలు విజయవంతంగా పూర్తి చేసి, యావత్ దేశం తమ వైపు చూసేలా సర్వేను నిర్వహించామన్నారు. రాష్ట్రంలో ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం, బీసీలు 46.25 శాతం, ముస్లిం మైనారిటీల్లో బీసీలు 10.08 శాతం, ముస్లింలతో సహా మొత్తం ఓసీలు 15.79 శాతం ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.దేశంలో బలహీన వర్గాలకు సంబంధించి ఇప్పటివరకు సహేతుకమైన సమాచారం లేదని, దీనితో రిజర్వేషన్లు అమలు చేసే క్రమంలో ఎన్నో ఇబ్బందులు కలిగే పరిస్థితి ఉందన్నారు. 1931 తర్వాత భారత దేశంలో ఇప్పటివరకు బలహీన వర్గాల సంఖ్య ఎంతో తేల్చలేదని, అందుకే భారత్ జోడోయాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ తెలంగాణలో పర్యటించిన సమయంలో రాష్ట్రంలో కులగణన చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కులగణన పై అసెంబ్లీలో తీర్మానం చేసి, సర్వే ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేయడమే కాక నేడు నివేదికను సభలో ప్రవేశపెట్టామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నివేదికను సభలో ప్రవేశపెట్టినట్లు ప్రకటించగానే సభ్యులు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు.ఇక సర్వేలో పాల్గొన్న సిబ్బంది గురించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో తండాల్లో ఎన్యుమరేటర్లు పకడ్బందీగా వివరాలను సేకరించారన్నారు. ప్రతి 150 ఇళ్లను ఒక యూనిట్ గా గుర్తించి ఎన్యుమరేటర్లను కేటాయించి వివరాలు సేకరించామని తెలిపారు. 76,000 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 36 రోజులు కష్టపడి ఈ నివేదికన రూపొందించారని, ఇందుకు రూ.160 కోట్లు ఖర్చు చేసి నిర్దిష్టమైన పకడ్బందీ నివేదిక రూపొందించినట్లు ప్రకటించారు.

పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తర్వాత సభలో ప్రవేశపెట్టామని, 56% ఉన్న బీసీలకు తగిన గౌరవం కల్పించేందుకు తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదికను రూపొందించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.తెలంగాణలో చేపట్టిన కులగణన సర్వేలో కేసీఆర్,కేటీఆర్, హరీష్ రావు, పద్మారావు, డీకే అరుణ పాల్గొనలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భూముల వివరాలు చెప్పాల్సి వస్తుందనే కేసీఆర్ కుటుంబం సర్వేలో పాల్గొనలేదన్నారు. బీఆర్ఎస్ చేసిన సమగ్ర కుటుంబ సర్వే అధికారిక డాక్యుమెంట్ అయితే నివేదికను ఎందుకు కేబినెట్ లో పెట్టలేదని ప్రశ్నించారు. అలాగే అసెంబ్లీలో ఎందుకు పెట్టలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, బీజేపీ, బీఆరెస్ లు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

# భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సదస్సుల్లో అందిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి సంబంధించి పి జి ఆర్ ఎస్ మరియు రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తుల పరిష్కారం అంశంలో సబ్ కలెక్టర్ నైదియాదేవితో కలిసి తాసిల్దారు, మండల సర్వేయర్, వీఆర్వోలతో కలెక్టర్ సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూభూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. రాజంపేట మండలానికి సంబంధించి పి జి ఆర్ ఎస్ ద్వారా 26 భూ వివాదాలు అర్జీలు అందాయని, అలాగే రెవెన్యూ సదస్సులలో 271 దరఖాస్తులు అందాయన్నారు. వీటిని నిర్ణీత కాల పరిమితిలోగా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి నాణ్యతతో వేగంగా పరిష్కరించాలని సూచించారు. పి జి ఆర్ ఎస్ లేదా రెవిన్యూ సదస్సులలో గ్రామంలో అన్నదమ్ముల సమ్యస్యలు, ముటేషన్స్, సరిహద్దు సమస్యలు ఎక్కువగా వస్తూ ఉంటాయని సమన్వయంతో అందరూ కలసి వాటిని పరిష్కరించడంతో మరింత సులభతరం అవుతుందని అన్నారు. ముటేషన్స్ లో సదరు కుటుంబ సభ్యులు భాగ పరిష్కారం చేసుకొని వస్తే త్వరగా ముటేషన్ చేయడం జరుగుతుందని దరఖాస్తుదారులకు వివరించాల న్నారు. ఒకవేళ వారు స్పందించకుంటే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి సమస్యను పరిష్కరిం చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిష్కారంపై స్వయంగా పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్కు సూచించారు. రెవిన్యూ సర్వీసులు ఒక క్లిష్టమైన ప్రక్రియ. ప్రజలతో మంచిగా గౌరవంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుం ది.ఎప్రభుత్వ నిబంధనలు మార్గదర్శకాల మేరకు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసినప్పుడు ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నిక్కచ్చిగా పనిచేసినప్పుడు ఒత్తిడిలు రావడం సహజమని. అంతమాత్రాన అధైర్య పడకుండా నిబంధనల మేరకు పనిచేయాలని సూచించారు. మీరందరూ ఒక కుటుంబంలా కలిసి పని చేసినప్పుడు సమస్యను అధిగమించే అవకాశం ఏర్పడుతుంది. ఎవరి పైన అయినా ఒత్తిడి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.అంతకు ముందుగా రాజంపేట మండలం బ్రాహ్మణపల్లి లో సర్వేనెంబర్ 101/3 లో అందిన ముటేషన్ పరిష్కారం అంశాన్ని క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో తాసిల్దారు పీర్ మున్ని, ఎంపీడీవో వరప్రసాదరావు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలి:రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి విద్యాశాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఎంపీడీవో కార్యాలయం లో ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణపై రాజంపేట, నందలూరు మండల ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపాఠశాలల పునర్ వ్యవస్థీకరణ కారణంగా ఏ ఒక్క విద్యార్థి నష్టపోకుండా భవిష్యత్తు లో కూడా వారికి అనుకూలంగా ఉపయోగపడే విధంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి

ఇబ్బందీ లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన పద్దతిలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు చేసే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు కూడా ఎటువంటి నష్టం జరగకూడదని, అందుబాటులో ఉన్న భవనాలు, ఇతర మౌలిక వసతులు వృధా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొనే విధంగా పునర్ వ్యవస్థీకరణను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గ్రామాల వారిగా పాఠశాలల వివరాలను, విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, పునర్ వ్యవస్థీకరణకు చేస్తున్న ప్రక్రియ తదితరాలలో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు.ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ నైదియాదేవి, డీఈఓ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.